# వేములవాడలో హనుమాన్ భక్తుల ఆధ్యాత్మిక సందడి

- నగరేశ్వర స్వామికి పాలాభిషేకం
- భారీ ర్యాలీతో మార్మోగిన వీధులు
- పాల్గొన్న ఆలయ ఈవో, ప్రజాప్రతినిధులు



**ప్రజానావ, వేములవాడ:** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వేములవాడలో హనుమాన్ జయంతి ఉత్సవాల వేళ ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ నగరేశ్వర స్వామి సన్నిధిలో హనుమాన్ భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏటా కొనసాగుతున్న ఆ నవాయితీని పాటిస్తూ, పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారికి భక్తిభావంతో పాలాభిషేకం చేసి, ప్రత్యేక హారతులు సమర్పించారు. అనంతరం పట్టణంలోని ప్రధాన వీధుల గుండా భక్తులు భారీ ర్యాలీ నిర్వహించగా, "జై శ్రీ రామ్.. జై హనుమాన్" నినాదాలతో వేములవాడ పురవీధులు మారుమోగాయి. ఈ వేడుకల్లో భాగంగా నిర్వహించిన ర్యాలీలో యువకులు, మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని ఆధ్యాత్మిక శోభను తీసుకువచ్చారు. శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఈవో రమాదేవి ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనకరపు రాకేష్, స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు కూడా భక్తులతో కలిసి ర్యాలీలో పాలుపంచుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు, నిర్వాహకులు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది.

# తూకం వేసిన ధాన్యం మిల్లులకు తరలించాలి

- టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచుకోవాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- రగుడు ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ



**ప్రజానావ, సిరిసిల్ల :** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుండి సేకరించి తూకం వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేలా చూడాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. శనివారం సిరిసిల్ల మున్సిపల్ పరిధి రగుడులో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో రైతుల సౌకర్యార్థం కల్పించిన సౌకర్యాలు, దిగుబడి వివరాలు, హమాలీల గురించి ఆరా తీశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు కల్పించడం జరిగిందని తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చిన వెంటనే జాప్యం చేయకుండా తూకం వేయాలని, అందుకు సరిపడా హమాలీలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. స్థానిక రైతులతో మాట్లాడి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా సరిపడా టార్పాలిన్లు అందుబాటులో పెట్టుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు ఎంత ధాన్యం సేకరించారు? ఎంత వరకు ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ పూర్తయింది అనే వివరాలను కొనుగోలు కేంద్రం నిర్వాహకులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల నుండి రైస్ మిల్లులకు ధాన్యం తరలించేందుకు వాహనాల కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ట్రాక్టర్ల ద్వారా ధాన్యం తరలించే అవకాశం ఉందని, జాప్యం చేయకుండా తరలించాలని, మిల్లుల్లో ధాన్యం బస్తాలు త్వరగా అన్ లోడ్ అయ్యేలా పర్యవేక్షణ చేయాలని అధికారులకు సూచించారు. తనిఖీలో జిల్లా పౌర సరఫరాల అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, సహకార శాఖ అధికారి రామకృష్ణ, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, తహసీల్దార్ జయంత్, తదితరులు ఉన్నారు.

# కచ్చితమైన గణాంకాల రూపకల్పనలో జనగణన కీలకం

- నేటితో ముగియనున్న 'స్వీయ గణన' గడువు
- రేపటి నుంచి ఇంటింటికీ ఎన్యూమరేటర్లు
- సిరిసిల్ల కలెక్టర్ గరిమ అగ్రవాల్
- సిరిసిల్లలో ఘనంగా జనగణన అవగాహన 'వాక్'..




**ప్రజానావ, సిరిసిల్ల:** దేశాభివృద్ధికి, సమగ్ర ప్రణాళికల రూపకల్పనకు కచ్చితమైన గణాంకాలు ఎంతో అవసరమని, అందులో జనగణన ప్రక్రియ అత్యంత కీలకమని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద మొదటి దశ జనగణనపై నిర్వహించిన అవగాహన వాక్‌ను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం అంబేద్కర్ కూడలి నుండి బతుకమ్మ ఘాట్ వరకు నిర్వహించిన 2కె వాక్‌లో స్వయంగా పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత జరుగుతున్న మొదటి జనగణన ఇదేనని, తొలిసారిగా పూర్తి డిజిటల్ విధానంలో ఈ ప్రక్రియను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ప్రజలు తమ కుటుంబ వివరాలను స్వయంగా నమోదు చేసుకునేందుకు వీలుగా ప్రవేశపెట్టిన 'స్వీయ గణన' ప్రక్రియకు ఈ నెల 10వ తేదీ (ఆదివారం) చివరి గడువు అని కలెక్టర్ స్పష్టం చేశారు. కేవలం ఐదు నిమిషాల్లో 34 ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చని, ఇందుకోసం కేటాయించిన అధికారిక వెబ్‌సైట్‌లో మొబైల్ నెంబర్ ద్వారా లాగిన్ అవ్వాలని సూచించారు. దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలనుకునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. మొదటి దశ జనగణనలో భాగంగా మే 11 నుండి జూన్ 9 వరకు ఎన్యూమరేటర్లు ఇంటింటికీ తిరిగి వివరాలను సేకరిస్తారని కలెక్టర్ తెలిపారు. శిక్షణ పొందిన అనుభవజ్ఞులైన సిబ్బందిని ఈ ప్రక్రియ కోసం నియమించామని, వారికి ప్రత్యేక గుర్తింపు కార్డులను జారీ చేశామని వివరించారు. ఎన్యూమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు ప్రజలు వారికి పూర్తిస్థాయిలో సహకరించి ఖచ్చితమైన వివరాలు అందించాలని కోరారు. జనగణన పేరుతో అనుమానిత వ్యక్తులు వచ్చే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. అధికారిక సిబ్బంది గుర్తింపు కార్డులపై క్యూఆర్ కోడ్ ఉంటుందని, దానిని స్కాన్ చేస్తే వెబ్‌సైట్‌లో వారి పూర్తి వివరాలు కనిపిస్తాయని, ఆ విధంగా సరిచూసుకున్న తర్వాతే వివరాలు తెలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసా చారి, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, పలువురు జిల్లా అధికారులు, తహసీల్దార్ జయంత్ మరియు జనగణన సూపర్ వైజర్లు పాల్గొన్నారు.







## శాంతి ప్రకాష్ శుక్లా మరణం
# సామాజిక ఉద్యమాలకు తీరని లోటు

**సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్**

**పార్థివ దేహం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ఘన నివాళి**

**ప్రజానావ, సిరిసిల్ల :** సామాజిక సేవకులు, ప్రముఖ న్యాయవాది, కమ్యూనిస్టు శ్రేయోభిలాషి శాంతి ప్రకాష్ శుక్లాకు సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా నివాళి అర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు, సిరిసిల్ల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అమృత్ లాల్ శుక్లా తనయుడు అయిన శాంతి ప్రకాష్ శుక్లా మే 7 వ తేదీ గురువారం రోజున అనారోగ్యంతో కన్నుమూశారు. ఈ సందర్భంగా శనివారం సిరిసిల్ల పట్టణంలోని కోర్టు ఎదురుగా ఉన్న వారి ఇంటి వద్ద ఆయన భౌతిక ఖాయానికి భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) ఆధ్వర్యంలో ఎర్రగుడ్డ కప్పి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారి అంతిమయాత్ర నిర్వహించి విద్యానగర్ లోని స్మశాన వాటికలో దహన సంస్కారాలు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జవ్వాజి విమల, కోడం రమణ, జిల్లా కమిటీ సభ్యులు గన్నేరం నర్సయ్య, సూరం పద్మ, అన్నల్దాస్ గణేష్ , ముక్తి కాంత్ అశోక్, సిపిఎం నాయకులు మిట్టపల్లి రాజమల్లు, రాపెల్లి రమేష్, ఎలిగేటి రాజశేఖర్, సిరిమల్ల సత్యం, జిందం కమలాకర్, గోవిందు లక్ష్మణ్, ఆడెపు రజిత, కోల శ్రీనివాస్, బింగి సంపత్, బాస శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# హనుమంతరావు దీక్షకు రాజన్న సిరిసిల్ల డీసీసీ అధ్యక్షుడి మద్దతు




**ప్రజానావ, సిరిసిల్ల :** కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా చేపడుతున్న జనగణనలో ఓబీసీలను కూడా లెక్కించాలి అనే డిమాండ్ తో ఓబీసీ ఎంపీల ఫోరం మాజీ కన్వీనర్, మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంతరావు ఆయన అంబర్ పేట నివాసంలో శనివారం నుండి చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష కు రాజన్న సిరిసిల్ల జిల్లా డీడీసీ అధ్యక్షుడు సంఘీభావం తెలిపారు. రాజకీయ పార్టీలకి అతీతంగా బీసీల అభ్యున్నతికి, బీసీ జనాభా ప్రతిపాదికంగా న్యాయం జరగాలంటే జనగణనలో బీసీ జనాభా కూడా లెక్కించాలని పలు మార్లు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి లేఖలు రాసిన కూడా సరైన స్పాందన లేకపోవడంతో ఈ దీక్ష ను చేస్తున్న వి.హనుమంత రావు రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ సంఘీభావం తెలిపారు.

